


# సద్దాం ఆంటీ ఇంటి కథ

**2002లో** ఓ రోజు పాత్రికేయుడు రాజా నాకు ఫోన్ చేసి, తను హాసం అనే పక్షపత్రికని ఎడిటర్‌గా నడుపుతున్నానని దానికి ఓ హాస్య సీరియల్ రాయమని కోరాడు. హాసం అనే పేరు హాస్యం, సంగీతంలోని మొదటి అక్షరాలని తీసుకుని పెట్టానని, ఇందులో రెండు అంశాలే ప్రధానంగా ఉంటాయని కూడా చెప్పారు. అప్పటికే ఓ కామెడీ నవలకి నాకో ఆలోచన ఉంది. 'రేపో మాపో పెళ్ళంట' నవలకోసం వచ్చిన ఆలోచనల్లో కొన్ని ఆ నవల్లో ఇమడలేదు. దానికోసం అనుకున్న చాలా కామెడీ సంఘటనలు, పాత్రలు మిగిలిపోయాయి. ఆ నవల నేపథ్యానికి కొద్దిగా భిన్నంగా, ఆ పాత్రలతో మరో నవలకి సినాప్సిస్ రాసి ఉంచుకున్నాను అని చెప్పాను. అది వినడానికి వచ్చిన రాజాగారికి నచ్చింది. అప్పుడో విషయం చెప్పారు.




"ముందు మరో ప్రముఖ రచయితని కామెడీ సీరియల్ రాయమని అడిగాను. 'నవల థీమ్ చెపితే రాస్తాను కామెడీ ఆలోచించడం నావల్లకాదు' అని ఆయన చెప్పారు. వెంటనే మీరు గుర్తుకువచ్చారు. మిమ్మల్ని అడిగాను."

నేను రాసిన చాలా కామెడీ నవలల్లో ప్రధాన పాత్ర ఒకదాన్ని తీవ్రంగా ఆశించడం, దాన్ని సాధించడానికి వచ్చే అడ్డంకులని అధిగమించడంలో కామెడీని సృష్టిస్తాను. 'డబ్బెవరికి చేదు'లో విడాకులని సాధించడం, 'వినాయకరావు పెళ్ళి'లో పెళ్ళి చేసుకోవడం, 'విటమిన్ ఎం'లో వారసత్వపు ఆస్థి సంపాదించడం, ఇలా. ఈ నవల కూడా ఆ కోవకి చెందిందే ఇది ఓ ఇంటి సేల్ డీడ్ నేపథ్యంలో సాగే కథ.

**సూక్ష్మంగా కథ.**

లంకంత కొంపకి యజమానురాలైన ఓ మోడ్రన్ బామ్మ తన మునిమనవరాలు అనన్యతో ఆ ఇంట్లో నివశిస్తోంది. ఆ ఇంటిని కొనడానికి అపార్ట్‌మెంట్ బిల్డర్లు ఎంతమంది వచ్చినా అమ్మదు. ఆ ఇంట్లోనే తను మరణించాలని ఉందని అబద్ధం చెప్తుంది. బేంక్‌లో క్లర్క్‌గా పనిచేసే అనన్య తన సహోద్యోగి నిరుపమ్‌ని ప్రేమించింది.

ఆవిడ భర్త రెండో ప్రపంచయుద్ధంలో మరణించాడు. కొడుకూ పోయాడు. మనవడు పోస్ట్‌లో స్విమ్మింగ్ క్లాసెస్ నేర్చుకుని డిప్లొమా సంపాదించి, టేంక్‌బండ్‌లో ఈత కొడుతూ మునిగి మరణించాడు. అతని భార్య డాక్టర్ సహాయంలేకుండా స్వతంత్రంగా

మరణించింది. మునిమనవరాలితో ఆర్థిక ఇబ్బందులతో మిగిలిన బామ్మ ఆ ఇంటిని చాలా కాలం క్రితమే గ్రామం (జి.రామం పేరుతో బర్త్ సర్టిఫికెట్ రాసిన గుమాస్తా జి తర్వాత చుక్కపెట్టలేదు) అనే అతనికి అమ్మింది. ఆవిడ ఎక్కువకాలం బతకదనే డాక్టర్ మాట మీద నమ్మకంతో పదివేల అడ్వాన్స్, ఆదాయం లేకపోవడంతో ఆవిడ మెయిన్‌టెనెన్స్‌కి నెలనెలా కొంత సొమ్ము బతికి ఉన్నంతకాలం పెంచుతూ ఇవ్వడం అనే క్లాజ్‌తో దాన్ని కొంటాడు. ఆవిడ మరణానంతరమే ఆ ఇల్లు అతనికి దక్కుతుంది గ్రామం, గ్రామం ఇద్దరు కొడుకులు కూడా పోయారు కానీ బామ్మ బతికే ఉంది. గ్రామం వారసులైన మనవలు బామ్మ ఎకౌంట్‌లో నెలనెలా డబ్బు కడుతూ ఎప్పటికైనా ఆ ఇంటిని పడగొట్టి అపార్ట్‌మెంట్లు కట్టించుకుని ఉండాలని అద్దె ఇళ్ళల్లో జీవిస్తూంటారు. ఆ ఇంటిని అమ్ముదామని కూడా ఓ అపార్ట్‌మెంట్ ఇస్తామని వారు బతిమాలినా ఆవిడ ఒప్పుకోదు. ఈ ముగ్గురు అన్నదమ్ముల్లోని ఆఖరివాడే అనన్య ప్రేమించిన నిరుపమ్.

బామ్మ సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని తెలిసాక పెద్దన్న లింగమయ్య, బిల్డర్ సుబ్బారావు కలిసి ఆవిడని హత్యచేయడానికి హాలకేశం అనే కిరాయి హంతకుడ్ని నియమించారు. దీనికి వారు సద్దాం ఆంటీ ఇంటి కథ అనే నిక్‌నేమ్ పెడతారు. కారణం ఇరాక్‌ని గెలుచుకున్నా కూడా అమెరికా సైనికులకి సద్దాం దొరక్కుండా ముప్పుతిప్పలు పెట్టడమే. ఈ నవల పూర్తయ్యే నాటికి సద్దాం హుస్సేన్ పట్టుబడలేదు. హాలకేశం అనే ఆ కామెడీ విలన్ ఓ పాముద్వారా సద్దాం ఆంటీని చంపాలని ప్రయత్నించినప్పుడల్లా అది జరగక ప్రతీసారి విధివశాత్తు దిగంబరంగా అయి పోలీస్‌లకి చిక్కుతూంటాడు. లింగమయ్య పాత బట్టలతో పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి, ఇన్‌స్పెక్టర్‌కి లంచం ఇచ్చి విడిపించి తెస్తూంటాడు. చివరకి హాలకేశం దగ్గర ఉన్న పాము యొక్క జంట పాము అతన్ని కాటేస్తుంది.

అనన్య బామ్మ కంకాళమ్మ, తాము చంపాలని అనుకునే సద్దాం ఆంటీ ఒకరే అని తెలిసాక నిరుపమ్ ఆ రహస్యం బామ్మ, మనవరాళ్ళకి చెప్పాడు. దాంతో ప్రాణభయంతో ఆవిడ ఇల్లు అమ్మడానికి ఒప్పుకుంది. నిరుపమ్ వాటాగా వచ్చిన రెండు అపార్ట్‌మెంట్స్‌లో ఒకదాన్ని అద్దెకి ఇచ్చి మరో దాంట్లో తన భార్య అనన్యతో కలిసి ఉంటాడు. వారి పదేళ్ళ కొడుకుని సద్దాం ఆంటీ కార్లో స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ స్కూల్లో దింపి పీజాహట్‌లో లంచ్ చేస్తూ, టివిలో ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ చూస్తూ ఇంకా బతికే ఉంటుంది.

అనన్యకి దైవ భక్తి ఎక్కువ. సినిమాల్లోని దేవుడి పాటలతో దేవుళ్ళ మేకప్‌లోని ఎన్టీఆర్, ఏఎన్నార్‌లాంటి వాళ్ళ చిత్రపటాలని పూజిస్తూంటుంది. నిరుపమ్ రెండో అన్న వెంకటరత్నం అందర్నీ అనవసరంగా పొగుడుతూంటాడు. ఇలా ఉదయించే సూర్యుడ్ని, నీళ్ళని ఇచ్చే పంపుని కూడా. ఇది చదవగానే రాజా ఫోన్ చేసి, 'ఫలానా వ్యక్తి' కదా అని నవ్వుతూ అడిగారు. అతని పేరు చెప్పడం అతన్ని కించపరచడమే కాబట్టి వదిలేద్దాం. అతని భార్య ఇందుకు వ్యతిరేకంగా అన్నింటిలో లోపాల్ని వెదుకుతూంటుంది.

జూన్ 2003లో దీన్ని లిపి పబ్లికేషన్స్ పుస్తకంగా ప్రచురించింది. 256 పేజీలు. వెల.రూ.60/- ఈ నవలని సరిగ్గా 50 సంవత్సరాల, 5 నెలల, 5 రోజులు జీవించిన మిత్రుడు 'శ్రీ వెంకట దుర్గా శివసుబ్రమణ్య శాస్త్రికి' అంకితం ఇచ్చాను. దర్శక, రచయితైన ఆయన ఇంటిపేరు జంధ్యాల.

www.anandbooks.com
www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments